రైతులపై బీమా భారం

- ప్రీమియం చెల్లించేందుకు 15వ తేదీ వరకు గడువు
- రైతులపై భారం వేయడంతో ఆగ్రహం
- గత ప్రభుత్వంలో ఈ–క్రాప్ బుకింగ్ చేసుకుంటే చాలు.. బీమా వర్తింపు



అధిక వర్షాలకు నీటమునిగిన వరి పంట

పాణ్యం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం కుంటుపడింది. ఎన్నికల వేళ వ్యవసాయ రంగానికి భరోసా కల్పిస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక రైతాంగాన్ని గాలికొదిలేశారు. రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం ఊసే లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఖరీఫ్ పంటకాలం పూర్తికాగా ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. ఆరు నెలల పాలనలో కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఖరీఫ్ దిగుబడులకు మార్కెట్‌లో మద్దతు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారు. చేసిది లేక వ్యాపారులకు చెప్పిన ధరకు దిగుబడులను అమ్ముకుంటూ నష్టాలు మూటగట్టుకుంటున్నారు. దీనికి తోడు రబీలో సాగు చేసిన పంటలకు రైతులే బీమా చేయించుకోవాలని, ఆయా పంటలకు నిర్దేశించిన మొత్తంలో ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ చేయడంతో అన్నదాతలు మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో ఈ–క్రాప్ నమోదు చేయించుకుంటే చాలు ఒక్క రూపాయి కూడా ఖర్చులేకుండా పంటల బీమా వర్తింపజేసి, ప్రకృతి విపత్తుల వల్ల పైర్లకు నష్టం జరిగితే రైతు ముంగిటకే పరిహారం అందించేవారని గుర్తు చేసుకుంటున్నారు.

వివిధ పంటలకు రైతులు చెల్లించాల్సిన ప్రీమియం ఇలా..

పీఎంఎఫ్‌బీవై (ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన) పంటల బీమా పథకం కింద ప్రీమియం చెల్లించి బీమా చేయించుకున్న రైతులకు తుపాన్, కరువు, అకాల వర్షాలు, దిగుబడి ఆధారిత ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. ఇందుకోసం రైతులు సాగుచేసిన పంటరకం, విస్తీర్ణాన్ని బట్టి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. మండలంలో ప్రస్తుత రబీ సీజన్‌లో 5990 మంది రైతులు 16,834.31 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. బీమా చేయించుకునేందుకు ఆయా పైర్లకు ఎకరానికి చెల్లించాల్సిన ప్రీమియం నిర్ణయించారు.

గత ప్రభుత్వం అందించిన పంటనష్టం వివరాలు		
సంవత్సరం	రైతులు	జమచేసిన నగదు (రూ.)
2020-21	1,016	61,30,016
2021-22	555	73,25,447
2022-23	923	1,09,05,074

పంట రకం	ఎకరానికి చెల్లించాల్సిన ప్రీమియం (రూ.)
శనగ	84
జొన్న	59.60
మినుము	47.60
వరి	126
ఉల్లిగడ్డలు	90

ప్రీమియం చెల్లించే విధానం

రైతులు పంటల బీమా చేయించుకునేందుకు పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, రైతు సేవా కేంద్రం నుంచి పంట నమోదు పత్రం, సెల్ నంబర్లు అందించాలి. వీటితో పాటు నిర్దేశిత ప్రీమియం చెల్లించి గ్రామ సచివాలయంలో గానీ, మీసేవ కేంద్రంలోగానీ, పోస్టాఫీస్‌లో గానీ బీమా చేయించుకోవచ్చు. బీమా చేయించుకోకుంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం జరిగితే ఎలాంటి పరిహారం అందదని అధికారులు చెబుతున్నారు.

గత ప్రభుత్వ పాలనలో రైతు ఖాతాలోకే పరిహారం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండేది. విత్తు నుంచి దిగుబడి విక్రయం వరకు అంతా ప్రభుత్వమే చూసుకునేది. రైతు కేవలం ఈ–క్రాప్ బుకింగ్ చేస్తే చాలు. పంటకు నష్టం వస్తే సకాలంలో పరిహారం రైతు ఖాతాలోకి జమ చేసింది. అంతేగాక దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రూ.3 వేల కోట్లు కేటాయించి ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు భరోసా కల్పించింది.

గతంలో క్రాప్ బుకింగ్ చేస్తే చాలు



గత ప్రభుత్వంలో వ్యవసాయ అధికారులు పొలం వద్దకు వచ్చి ఈ–క్రాప్ బుకింగ్ నమోదు చేసేవారు. ఒక్కరూపాయి కూడా రైతు నుంచి వసూలు చేసేవారు కాదు. ఈ–క్రాప్ నమోదు చేసుకుంటే అన్ని వ్యవసాయ పథకాలు సకాలంలో అందేవి. ఇప్పుడు రైతులే పంటల వారీగా ప్రీమియం చెల్లించాలని చెబుతున్నారు. నేను రెండెకరాల్లో జొన్న, ఎకరంలో వరి, మిరప పంటను సాగు చేస్తున్నాను. గత ప్రభుత్వంలో రైతులకు ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగించాలి.

– నేతుల భాస్కరరెడ్డి, కొత్తూరు

రైతుకు మరో సమస్య



కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా వారిపై అదనంగా భారం వేయడం దుర్మార్గం. ఇప్పటికే అకాల వర్షాల వల్ల రైతులకు అపార నష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి. రబీలో సాగుచేసిన పంటలకు రైతులే ప్రీమియం చెల్లించాలని చెప్పడం వారిని మోసం చేసినట్లే అవుతుంది. ప్రభుత్వమే బీమా చెల్లించి రైతులను ఆదుకోవాలి.

– మహేంద్రారెడ్డి, మద్దూరు

ఈనెల 15వ తేదీ వరకు గడువు

రబీలో సాగు చేసిన పంటలకు రైతులు గ్రామ సచివాలయాల్లో, మీసేవ కేంద్రాల్లో, పోస్టాఫీసులో ప్రీమియం చెల్లించి పంట బీమా చేయించుకోవచ్చు. బ్యాంకులో రుణాలు తీసుకొని రైతులకు మాత్రమే పంట బీమా నమోదుకు అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు 15 శాతం బీమా నమోదైంది. వరి పంట బీమాకు ఈనెల చివరి వరకు గడువు ఉంది. పంట నమోదు చేయించుకుంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లితే పరిహారం అందుతుంది.

– జయప్రకాష్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

ఇలా వచ్చి.. అలా వెళ్లారు !



గడివేములలో పీజీఆర్ఎస్‌కు తక్కువ సంఖ్యలో హాజరైన అధికారులు

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు ఇలా వచ్చి.. అలా వెళ్లిపోతున్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రానికి వెళ్లకుండా మండలస్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేందుకు.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ ఉదయం 11 గంటల వరకు మండలాధికారులకు వివిధ అంశాలపై సూచనలు చేస్తారు. అనంతరం మండలాధికారులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. ఇదిలా ఉండగా సోమవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ అయిపోయిన తరువాత మండల స్థాయి అధికారులు వెళ్లిపోయారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తహసీల్దార్, ఈఓపీఆర్డీ, ఏఓ, అంగన్‌వాడీ సూపర్ వైజర్ తప్ప మిగతా అధికారులు కనిపించలేదు. దీంతో ఆయా మండల స్థాయి అధికారులకు సమస్యలను చెప్పుకునేందుకు వచ్చిన బాధితులు వెనుదిరిగారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పీజీఆర్ఎస్‌కు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సమాయత్తమవుతున్నారని తెలిసింది.

సెలవులో తహసీల్దార్

కర్నూలు(రూరల్): కర్నూలు మండల తహసీల్దార్ టి.వి.రమేష్‌బాబు ఈ నెల 23వ తేదీ వరకు సెలవులో వెళ్లినట్టు డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ సోమవారం తెలిపారు. అప్పటివరకు కర్నూలు అర్బన్ తహసీల్దార్ సి.వెంకటలక్ష్మి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారని చెప్పారు.

ఇద్దరు మెడికోలకు తీవ్రగాయాలు



గాయపడిన విశ్వభారతి మెడికల్ కాలేజీ విద్యార్థులు

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలోని పెంచికలపాడు పత్తి మిల్లు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మెడికల్ విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పెంచికలపాడులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలో విద్యను అభ్యసిస్తున్న తాడిపత్రికి చెందిన గోపికృష్ణ, వైఎస్సార్ జిల్లాకు చెందిన సాయిమణి సోమవారం రాత్రి కళాశాల హాస్టల్లో భోజనం చేసి కె.నాగలాపురం వద్ద ఉన్న రూమ్‌కు బైక్‌పై బయలుదేరారు. కాసేపటికి పెంచిలకపాడు పత్తి మిల్లు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అక్కడి ప్రజలు వారిని చికిత్స నిమిత్తం స్థానిక విశ్వభారతి మెడికల్ కళాశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కె.నాగలాపురం ఎస్‌ఐ అశాలత ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడ్డ విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థులు స్పృహలో లేకపోవడంతో ప్రమాద ఘటనపై పూర్తి సమాచారం తెలియరాలేదు.

ప్రజా వినతులు పట్టని అధికారులు



కోడుమూరు పీజీఆర్ఎస్‌కు ఎంపీడీఓ రాముడు మాత్రమే హాజరైన దృశ్యం

కోడుమూరు రూరల్: ప్రజాసమస్యల పరిష్కారం కోసం సోమవారం కోడుమూరులో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం పట్ల మండల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏదో మొక్కుబడిగా కార్యక్రమానికి వచ్చి వెళ్లడం తప్ప ఏమి చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు మాత్రమే సమయానికి వచ్చి పాల్గొన్నారు. మిగతా అధికారులు మాత్రం 11:15 గంటల తర్వాత ఒక్కొక్కరిగా వచ్చి సంతకాలు చేసి కొద్దిసేపు ఉండి మమ అన్పించి వెళ్లారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



గూడూరులో సమ్మె చేస్తున్న నగర పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని, గూడూరు నగర పంచాయతీ ఔట్ సోర్సింగ్ కార్మికులు అరవింద్, మధు స్పష్టం చేశారు. ఈ మేరకు గూడూరు నగర పంచాయతీ కార్మికులు సోమవారం నుంచి విధులను బహిష్కరించి సమ్మెబాట పట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి శిబిరం వద్దకు చేరుకుని దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అరవింద్, మధు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా జీతాలు పెంచకపోవడంతో పెరిగిన నిత్యావసర ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతి కార్మికుడికి నాన్ టెక్నికల్, టెక్నికల్ ఆధారంగా నెలకు రూ.24,400 నుంచి రూ.29,200 వరకు జీతాలు ఇవ్వడంతో పాటు, 15 సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్న వారిని పర్మినెంటు చేయాలన్నారు. కార్మికులందరికీ పెండింగ్ లేకుండా నెల నెలా జీతాలను సక్రమంగా ఇచ్చి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె వీడేది లేదని స్పష్టం చేశారు. నగర పంచాయతీ కార్మికులు షబ్బీర్, బసవరాజు, జయన్న, ఖాజాహుసేన్, హుసేన్‌ఖాన్, అలీబాషా, హరి తదితరులు పాల్గొన్నారు.

పంట కోతలు వాయిదా వేసుకోవాలి



సి.బెళగల్‌లో పొగాకు పంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలో వరి, పొగాకు, కంది సాగు చేసిన రైతులు పంట కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సూచించారు. ఆయన సోమవారం వ్యవసాయ సిబ్బంది, రైతులతో కలిసి మండల కేంద్రంలో రైతులు సాగు చేసిన పొగాకు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పొగాకు పంట సంరక్షణకు చర్యలను తెలియజేశారు. ఈనెల 11వ తేదీ నుంచి అల్పపీడనం ఏర్పడి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని, ఈ మేరకు రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి, పొగాకు రైతులు కోతలను వాయిదా వేసుకోవాలని, వరి దిగుబడులు కళ్లాల్లో కుప్పగా ఉంచుకున్నట్‌లైయితే ఎకరా దిగుబడికి 25 కేజీల ఉప్పును వరి పనలపై చల్లుకుంటే నష్ట శాతం తగ్గించుకోవచ్చని ఏఓ చెప్పారు. వరి, పొగాకు దిగుబడుల నాణ్యత తగ్గకుండా రైతులు టార్పాలిన్‌ను కప్పి ఉంచుకోవాలని సూచించారు.

నేడు రెండు గ్రామాల్లో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం

మండల పరిధిలోని కొండాపురం, ముడుమాల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఓ ప్రకటనలో తెలుపుతూ.. మంగళవారం ఉదయం కొండాపురం గ్రామ సచివాలయంలో, మధ్యాహ్నం ముడుమాల గ్రామ రైతు సేవా కేంద్రంలో ×పొలం పిలుస్తోంది౯ కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం రైతులతో కలిసి పంట పొలాల సందర్శన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఆయా గ్రామాల రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఓర్వకల్లు: బంగాళఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం కారణంగా ఈనెల 15వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం కోతలకు సిద్ధంగా ఉన్న వరి, పొగాకు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తుపాను ముప్పు ముగిసే వరకు పంట కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. కోతకోసిన ధాన్యం, పొగాకును సురక్షిత ప్రాంతంలో టార్పాలిన్లతో కప్పి ఉంచాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

- ఆర్టీసీ బస్సును కంటైనర్ ఢీకొట్టడంతో ప్రమాదం
- చిన్నటేకూరు సమీపంలో ఘటన



ధ్వంసమైన బస్సు వెనకభాగం

కల్లూరు: కర్నూలు నగర శివారు 44వ జాతీయ రహదారిపై చిన్నటేకూరు సమీపంలో బస్సును కంటైనర్ ఢీకొట్టిన ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఘటనపై ఉలిందకొండ ఎస్‌ఐ ధనుంజయ తెలిపిన వివరాల మేరకు.. డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు కర్నూలు నుంచి డోన్‌కు వెళ్తోంది. 44వ జాతీయ రహదారిపై చిన్నటేకూరు సమీపంలోని ప్రైవేట్ స్కూల్ వద్ద వెళుతుండగా వెనక వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. బస్సులో ఉన్న రియాజ్, రంగస్వామితో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ప్రమాదంలో బస్సు వెనక భాగం దెబ్బతింది. దీంతో వెనక భాగంలో కూర్చున్న ప్రయాణికులు గాయాలపాలై బయటకి రాలేక కొద్దిసేపు ఇబ్బంది పడ్డారు. హైవే పెట్రోలింగ్ హెడ్ కానిస్టేబుల్ నూర్ అహమ్మద్, ఉలిందకొండ సిబ్బంది జేసీబీ తెప్పించి సుమారుగా గంట సమయం కష్టపడి రేకులను కట్ చేసి గాయపడిన వారిని బయటకు తీసి 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్రాహ్మణదొడ్డిలో నేడు రెవెన్యూ సదస్సు

సి.బెళగల్: మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం పేర్కొంటూ.. రైతులు, ప్రజల భూ సమస్యలు పరిష్కరించేందుకు మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులలో భాగంగా గ్రామ సభలను నిర్వహించి, దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. 10వ తేదీ బ్రాహ్మణదొడ్డి గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించి, రైతులు, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.అలాగే 11న కొత్తకోట గ్రామంలో రెవెన్యూ సదస్సు ఉంటుందని, మండల ప్రజలు, రైతులు కార్యక్రమాలలో పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

కూటమి పాలనలో పేదలకు వాతలు

కర్నూలు(సెంట్రల్): కూటమి సర్కారు పేదలకు వాతలు పెడుతోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి విమర్శించారు. సోమవారం పాత బస్టాండ్‌లోని బావర్చి బంకెట్ హాల్‌లో ఎస్.సోమన్న ప్రాంగణంలో సీపీఎం కర్నూలు ఓల్డ్‌సిటీ 20వ నగర మహాసభలు జరిగాయి. నాయకులు విజయ్, ఎస్ఎండీ షరీఫ్, జయమ్మ అధ్యక్షతన సీనియర్ నాయకులు కేవీ సుబ్బయ్య పతాకావిష్కరణ చేసి అమరవీరులకు నివాళులర్పించారు. అంతకుముందు సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి, సోమన్న చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూ రాజ్యాంగ పరిరక్షణ.. మత సామరస్యం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి అయ్యే ఖర్చు కంటే హోర్డింగ్‌ల కోసం కూటమి సర్కార్ చేస్తున్న ఖర్చు ఎక్కువగా ఉంటోందన్నారు. డీఎస్సీ పేరిట సీఎం చంద్రబాబు నిరుద్యోగ యువతను మోసగించారని విమర్శించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతుండడంతో విద్యార్థులు వాటి బారిన పడిజీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల మాట్లాడుతూ.. కూటమి పాలనలో నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన చైతన్య గీతాలు కార్యకర్తలను ఉత్తేజపరిచాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



గడివేముల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారదబాయి

గడివేముల: ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారదబాయి సూచించారు. ఆమె సోమవారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రజారోగ్యానికి సంబంధించి మండలంలో నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది ప్రజల ఇంటివద్దకు వెళ్లి ఆరోగ్య సర్వే చేయాలన్నారు. కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలను చేపడుతోందన్నారు. వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి వైద్య సేవలందించాలన్నారు. అవరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందని చెప్పారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా చూసుకోవాలని డాక్టర్ కిరణ్‌కుమార్‌కు సూచించారు. ఎంపీహెచ్‌ఈఓ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్, ఏఎస్ఎం భారతి, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పీజీఆర్ఎస్‌కు తొమ్మిది దరఖాస్తులు



సి.బెళగల్ పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, అధికారులు

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి తొమ్మిది దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్, ఎంపీడీఓ రాణెమ్మ ఇతర మండల అధికారులు హాజరయ్యారు. వచ్చిన తొమ్మిది దరఖాస్తులు రెవెన్యూ సంబంధ అర్జీలేనని తహసీల్దార్ తెలిపారు. అయితే కార్యక్రమానికి కొందరు అధికారులు రెగ్యులర్‌గా హాజరు కాకపోవడం, అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వైద్య, ఇరిగేషన్, హౌసింగ్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, ఏఓ మల్లేష్‌కుమార్, ఎంఈఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ ఏఈలు గోసేనాయక్, సుకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, ఏపీఓ రామన్న తదితర అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో వినతుల వెల్లువ



అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి భారీగా వినతులు వెల్లువెత్తాయి. తహసీల్దార్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు స్పెషల్ కలెక్టర్ కల్యాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు నాగన్న, మధుసూదన్, షాజహాన్, శ్రీధర్ తదితరులు.. నన్నూరు గ్రామ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల భూ కబ్జాలను అరికట్టాలని వినతి పత్రం సమర్పించారు. అలాగే గ్రామంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదలు ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న భూములకు పట్టా, పాసు పుస్తకాలు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం అన్యాయమన్నారు. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని వివరించారు. గ్రామానికి చెందిన సుబ్బమ్మకు సర్వే నంబర్ 157లో 1.25 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదన్నారు. అలాగే మంగళి చిన్న మద్దయ్య సర్వే నంబర్ 150/3లో కొంత రిజిస్టర్ పట్టా భూమిని కొనుగోలు చేసి సుమారు 15 ఏళ్లు అయినప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతుల భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామం జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో భూములకు విపరీతంగా ధర పెరిగిందని, దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు జేసీబీ, డోజర్లతో ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలను అరికట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండల సర్వేయర్ శంకర్‌మాణిక్యం, ఈఓలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, విజయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఏఓ జయప్రకాష్‌రెడ్డి

పాణ్యం: ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి జయప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ దిగుబడుల స్టాల్ ఏర్పాటు చేసి ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతులు ఈ పద్ధతిలో పంటలతో పాటు కూరగాయాలు సాగు చేస్తే రెండింతల లాభాలు సాధించవచ్చన్నారు. మద్దూరు యూనిట్ ఆధ్వర్యంలో ఏటీఎం మోడల్‌గా ఈ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ భాస్కర్, ఐసీఆర్‌పీలు శ్రీనివాసులు, నారాయణరెడ్డి, శేఖర్, నాగలక్ష్మమ్మ, నాగేశ్వరమ్మ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం



కరిమద్దెల గ్రామంలో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలపై అవగాహన నిర్వహించినట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు తెలిపారు. సోమవారం ప్రజలకు గ్రంథాల గురించి అవగాహన కల్పించారు. ప్రజలకు భగవద్గీత ప్రతులను అందజేశారు. హిందూ ప్రాముఖ్యతను వివరించారు. కమిటీ సభ్యులు సంజీవ, నాగమద్దిలేటి, శీను, కుమార్, సుజాతమ్మ, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మట్లాడుతున్న ఆర్డీఓ కిదారి సందీప్‌కుమార్

కర్నూలు(రూరల్): మండల పరిధిలో గొందిపర్ల గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కర్నూలు ఆర్డీఓ కిదారి సందీప్ కుమార్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ సి.వెంకటలక్ష్మి పాల్గొని రైతుల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామంలో మిగులు, గ్రామకంఠం భూముల వివరాలు సేకరించారు. సదస్సులో రైతుల నుంచి 14 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. ఇంటి స్థలాలు, నిషేధిత జాబితా భూములు తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సర్పంచ్ బి.శ్రీనివాసులు, మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్‌ఓలు మహనంది, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై వివక్షను నిర్మూలించాలి

కల్లూరు: మండల పరిధిలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బేటీ బచావో – బేటీ పడావో (ఆడపిల్లలను రక్షిద్దాం – ఆడపిల్లలను చదివిద్దాం) అనే కార్యక్రమంపై డెమో శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల తల్లీబిడ్డలకు అనారోగ్యం ఏర్పడుతుందని, మాతృ లేదా శిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉంటుందన్నారు. లింగ నిష్పత్తిలో సమతుల్యత లేకపోవడం వల్ల ఏర్పడే నష్టాల గురించి వివరించారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని, ఎలాంటి వివక్ష ఉండరాదన్నారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అని పిలుపునిచ్చారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యురాలి మృతి

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో 9వ వార్డు సభ్యురాలైన షేక్ అమీనాబీ (70) గుండెపోటుతో మృతి చెందారు. ఆమె సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల మాజీ ఎంపీపీ దేరెడ్డి ఆదిశేషారెడ్డి, సర్పంచ్ సోడం మాధవి, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, గ్రామ కార్యదర్శి సరోజినిదేవి సంతాపంతెలిపారు. మృతురాలికి భర్త అబ్దుల్ ఖాదర్, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం ఉన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను మంగళవారం మంత్రాలయం సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు డివిజన్ల పరిధిలోని వినియోగదారులు ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 మధ్య విద్యుత్ సమస్యలపై వినతులు సమర్పించి పరిష్కారం పొందాలని సూచించారు.